అనూహ్యం

కొలను వేంకట దుర్గాప్రసాద్

ఒం[illegible] బస్టాండులో టిక్కెట్టు తీసుకొని బెజవాడకు వెళ్ళే బస్సు ఎక్కాడు నాగభూషణం. చేతిలోని చిన్న సంచిని ప్రక్కన పెట్టుకున్నాడు. టైము చూసుకున్నాడు. పది అయింది. 'అయితే భోజనం వేళకి బెజవాడ చేరుకోవచ్చు' అనుకున్నాడు.

బస్సు ఇప్పుడప్పుడే కదిలేలా లేదు అనుకుంటూ కిటికీలోంచి బయట జనాన్ని చూస్తూ వుండిపోయాడు.

బస్సు నిండిపోయింది. డ్రైవర్ అప్పుడే తన సీట్లోకి వచ్చి కూర్చున్నాడు.

కొన్ని దూరంలో ఒకాయన కంగారుగా వెళ్ళి బుక్కింగ్ ఆఫీసులో టికట్లు తీసుకున్నాడు. గబగబా నడుచుకుంటూ 'సుధా! త్వరగా రండి. బస్సు కదులుతోంది' అన్నాడు.

'సుధ' అనే పిలుపుకి నాగభూషణం ఉలిక్కిపడ్డాడు. ఆతృతగా అతను పిలిచిన వేపుకి చూశాడు.

ఓ పాతికేళ్ళ ఆవిడ చంటివాణ్ని ఎత్తుకొని నడుస్తూ బస్సుని సమీపిస్తోంది. ప్రక్కనే ఓ నాలుగేళ్ళ కుర్రాడు ఆవిడ చేయి పట్టుకొని నడుస్తున్నాడు.

వాళ్ళు బస్సులో ఎక్కారు. ఆయన మాత్రం ఎక్కలేదు. 'సుధా! ఇకనేనుంటా, ఆఁ—?.. వాణ్ని కూడా ఒసారి రమ్మని చెప్పు. బొత్తిగా రావడం మానేశాడు. మరి, నేనుంటా' ఆయన అన్నాడు. సుధ తలూపింది. ఆయన అందించిన సామాను ప్రక్కన పెడుతూ.

సుధని చూశాడు వెనక్కి తిరిగి గభాల్ని మొహం తిప్పేసుకున్నాడు. 'ఇప్పుడేం చెయ్యాలి'' తన మొహం సుధకి ఎలా చూపించాలి? సుధ మధ్యలో ఎక్కడన్నా దిగుతుందా లేక బెజవాడ వరకూ వస్తోందా? నయం.. సుధ ఇంకా తనని చూళ్ళేదు. చూసిందంటే అసహ్యించుకోదూ?.. చాలా ఇరుకున పడ్డానే.. బస్సు దిగితే బాగుణ్ను.'

బస్సు దిగుదామని నిశ్చయించుకొని లేవబోయాడు. కానీ బస్సు అప్పటికే ఫర్లాంగు దూరం నడిచింది. అది గమనించి ఉస్సురని కూలబడ్డాడు.

బస్సు స్పీడుకి గాలి మొహానికి గట్టిగా తగులుతోంది నాగభూషణానికి.

'సుధని ఇవాళ అనుకోకుండా కలిశాడు తను. సుధ బెజవాడలో దిగి తనని గుర్తుపడితే ఏంచెయ్యాలి? అయిదేళ్ళ క్రితం సంగతి. ఇంకా సుధకి గుర్తు? ఏమో మరి? సుధకి గుర్తుందో లేదో కాన్ని తనకి మాత్రం ఎప్పుడూ గుర్తే!

ఒక్కసారి ఐదేళ్లు వెనక్కి వెళ్లాడు నాగభూషణం.

సుధా, నాగభూషణం ఒకేసారి డిగ్రీని ఆర్జించుకొని కాలేజీలోంచి బయటపడ్డారు కొందరి లాగే.

సుధకి అమ్మవుంది. ఆస్తి వుంది కొద్దిగా. తండ్రి చిన్నప్పుడే గతించాడు. ఇంకా సుధ తర్వాత ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఇదీ సుధ గురించి నాగభూషణానికి తెలిసిన వివరాలు.

సుధ అందమైనదని కాలేజీలో అంతా ఒప్పుకుంటారు. చదువులో కూడా అందరి కన్నా పైచేయిగా వుండేది. సుధ మిత భాషిణి. దాదాపు మౌనంగా ఉండేది. 'కాలేజీకి చదువుకోడానికి వస్తున్నాం మరో ఉద్దేశంతో రావడంలేదు' అన్నట్టుగా వుండేది.

ఆమె మౌనం మగాళ్లందరికి బాధ కలిగించేది. ఒకవేళ ఎవరన్నా మొగాడు మాట్లాడినా పట్టించుకునేది కాదు అంతగా. తోటి ఆడపిల్లలతో పాటు, మొగాళ్లు కూడా 'మూగమ్మాయి' అని సుధకి పేరు పెట్టారు.

నాగభూషణం సుధకి క్లాసుమేటు కాకపోయినా ఒకే కాలేజీ కావడంవల్ల ఒకరి పేర్లు ఒకరికి తెల్సు. కాలేజి మొత్తంలో పొడగర్రిన (అంటే చక్కగా) మొగాడు ఒక్క నాగభూషణమే. అది అందరికి తెల్సిన విషయమే. ఆ విధంగానే సుధకి నాగభూషణం పేరు గుర్తు.

ఇక నాగభూషణం సంగతి. అతను సుధ ఆకర్షణకి లోనయ్యాడు ఫైనలియరు చదివే రోజుల్లోనే. ఆమె మీద చెప్ప లేనంతగా అభిమానం పెంచుకున్నాడు.

నాగభూషణం అలా సుధని అభిమా నించడానికి అనేక కారణాలున్నాయి. వాటిల్లో కొన్ని—సుధ పంతొమ్మిదేళ్లే కదా అని రెండు జడలు వేసుకోదు. చక్కగా వాలు జడ వేసుకొని కొద్దిగాపూలు తల్లో తురుము కునేది. ఆమె ఎప్పుడూ నొసటన తిలకం ధరిస్తుండేది. చేతులకి గాజులు వేస్తుం డేది. అనవసరంగా ఎవరితోనూ మాట్లా డదు. పగలబడి నవ్వదు.

కాలేజి అమ్మాయి లందరికి ఈ పై లక్ష ణాలు లోపంగానే వుంటాయి. ఈలోపాలు ఒక్కొక్క అమ్మాయిలో కనిపించకపోయినా కాలేజీ మొత్తంలో చూస్తే ఇవన్నీ కని పిస్తాయి నాగభూషణానికి. అందుకే మిగతా వాళ్లంటే అభిమానించలేక పోయ్యాడు. నాగభూషణానిది సుధది వేర్వేరు గ్రూపు గాబట్టి సరిపోయింది. లేకపోతే నాగభూష ణం తప్పకుండా తప్పేవాడే—డిగ్రీ.

పరీక్షా ఫలితాలు రావడంతో, వీడ్కోలు రావడంతో ఇద్దరికీ కాలేజీతో ఋణం తీరి పోయింది.

నాగభూషణం ఉద్యోగం కోసం ప్రయ త్నాలు మొదలుపెట్టాడు.

ఓరోజు ఒక కంపెనీలో ఇంటర్వ్యూకి అని నాగభూషణం బయలుదేరాడు. సెలుగా తయారై బస్టాపులో నుంచున్నాడు బస్సు కోసం ఎదురు చూస్తూ. బస్సు రాలేదుగానీ, సుధ వచ్చింది అదే బస్టాప్ దగ్గరికి. నాగభూషణం మెల్లగా సుధ వంక చూశాడు. ఆమె చేతిలో చిన్న టిఫిన్ కారియర్ వుంది. 'ఎక్కడికెళుతుందో?' అనుకున్నాడు నాగభూషణం.

బస్టాప్‌లోని జనం అంతా సుధ వంకే చూస్తున్నారు. చాలా సింపుల్‌గా ఉన్న ఆమె అందాన్ని చూడకుండా ఉండలేకపోతున్నారు.

కానీ నాగభూషణం సుధని మిగతా వాళ్ల లాగ చూడడానికి భయపడ్డాడు.

'ఏవిటీ మొగాళ్లు, పాపం సుధ అలా సిగ్గుతో కుంచించుకుపోతుంటే అలా గుచ్చి గుచ్చి చూస్తారెందుకు? ఛీ! ఛీ! బొత్తిగా సంస్కారం తెలియని వాళ్లు' తిట్టు కున్నాడు నాగభూషణం మిగతా వాళ్లకేసి చూసి.

బస్సు ఎదురు చూసిన కొలది ఆలస్య మయ్యింది.

'పాపం సుధ నిలబడలేకపోతోంది!' నొచ్చు కున్నాడు నాగభూషణం.

కాసేపటికి బస్సువచ్చి సుధని రక్షించింది. అంతా బస్సుకోసం గుమిగూడారు. సుధ ఆ జనంలో కలిసిపోయింది! అనుకోకుండా నాగభూషణం కూడా సుధ వెనకనే నిల బడ్డాడు. మెల్లగా అందరూ బస్సుఎక్కారు. బస్సు బరువుగా కదిలింది.

ఆమెకి సీటు దొరికింది. బస్సులో సుధ ముందే నిల్చుని ఉండాల్సి వచ్చినందుకు, కొద్దిగా ఇబ్బంది అనుభవించాడు నాగ భూషణం. మరికొంచెం సిగ్గుపడ్డాడు.

ఆమె ఎక్కడికి టిక్కెట్టు అడిగిందో విన్నాడు. కాసేపటికి ఆమె దిగవలసిన చోటు రావడం, ఆమె దిగి వెళ్లిపోవడం జరిగాయి.

ఇంటర్వ్యూ అయింది నాగభూషణానికి. ఫలితాలు తర్వాత చెప్తామన్నారు. అంతా మామూలు తంతు.

ఆ రోజు సాయంత్రం రాము కలిశాడు నాగభూషణానికి. ఉదయం సుధని బస్టాప్‌లో చూసిన సంగతి చెప్పాడు రాముకి.

రాము నవ్వి, "సుధ ఓ మెడికల్ కంపెనీలో పనిచేస్తోందిరా. రోజూ బస్సుకోసం అక్కడే నుంచుంటుంది. నీకు తెలీదా?" అడిగాడు.

రామునికి నాగభూషణం గురించి బాగా తెల్సు. సుధంటే నాగభూషణానికి ఎంత ఇష్టమైనా కూడా తెల్సు.

"అయినా ఏం ప్రేమరా నీది? నీవంటి ప్రేమించటం కూడా చాతకాదు. సరిగ్గా ఎదురుపడి మాట్లాడలేవు. ఆడాళ్లతో, తలొంచుకుంటావు. అసలు వాళ్లు చేయవలసిన పని. ఛీ! నీ లాంటి మగ వాళ్లకి తలవంపులు. అదికాదురా భూష ణం! నువ్వు ఆ అమ్మాయిని రెండేళ్లనుంచి ప్రేమిస్తూనే ఉన్నావ్ అది బాగానే వుంది. ఆ విషయం ఆమెకి తెలియజెప్పావా? ఎప్పుడూ దూరదూరంగా తిరుగుతావు అమ్మాయి అంటేనే.. అసలు ఆడవాళ్లంటేనే అల్లంత దూరంలో తిరుగుతావని అందరికి తెల్సు. ఇక ఆఅమ్మాయి నీ ప్రేమ సంగతి ఎలా తెల్సుకుంటుంది" అన్నాడు విసుగ్గా.

రాము చెప్పింది నిజమే అనిపించింది నాగ భూషణానికి. కానీ ప్రేమని తెలియజెప్పడం ఎలా?

రాము చెప్పేదేవిటంటే..ముందు అమ్మా యితో మాటలు సాగించాలి. తర్వాత మాటలు వాటికంతటు అవే పెరిగిపోతాయి అంటాడు. కానీ ఎలా మాట్లాడాలి, ఏం, మాట్లాడాలి? ఒకవేళ ఎదురుపడిందే అను కుందాం. పలకరించాలి. ఏమని? పలక రింపుకు కూడా సమయం సందర్భం ఉండాలి. ఏదీ లేకుండా ఎలా మాట్లాడ్డం? ప్రేమించడం సులువే, కానీ ప్రేమని తెలియపరచుకోడం చాలా కష్టం. ఇక తను ధైర్యం చేసి మాట్లాడినా ఎక్కడ మాట్లా డుతాడు? ఆ బస్టాప్‌లోనేనా? అంత మంది జనంలోనా? లాభంలేదు. తను అంత ధైర్యం చేయలేదు.' నాగభూషణం మదన పడ్డాడు.

నాగభూషణం బాధ ఒక్కటే. అతనికి

అనూహ్యం

సుధంటే రెండేళ్లనుంచి ఇష్టమే. కాని అది తెలుపుకోడం ఎలా? 'ఆడవాళ్లకి చాలా సున్నితమైన హృదయం ఉంటుంది. ప్రతి చిన్న విషయానికి బాధపడే తత్వం వాళ్లది.' ఇది నాగభూషణం అభిప్రాయం.

'కాబట్టి వాళ్లకి ఇష్టంలేని పని చేయకూడదు. తను ఆమెని పలకరించడం ఇష్టమో కష్టమో? ఒకవేళ ఏదో చనువుగా పలకరిస్తే ఆ బస్టాప్‌లో జనం అంతా మా ఇద్దరి కేసి చూస్తారు. సుధ సిగ్గుపడుతుంది. అవమానంగా భావిస్తుంది.. అప్పుడు ఆమె దృష్టిలో తను చెడ్డవాడిగా స్థిరపడిపోతాడు. అమ్మో! అలా జరగడం తనకి ఇష్టంలేదు. అందుకనేగా రెండేళ్లనుంచి సుధ మీద ప్రేమ తనలోనే అణిచిపెట్టుకున్నాడు. నాగభూషణం ఆలోచించాడు.

'ఆ విధంగా తను మంచితనాన్ని కాపాడ్కుంటూ వచ్చాడు రెండేళ్లనుంచి ఆమెని పలకరించకుండా. తన మంచితనమే ఆమెని ఆకర్షించాలి. ఆమే చొరవ తీసుకొని పలకరించాలి. అందుకే తన ప్రేమని తనలోనే అణుచుకోవాలి. తప్పదు మరి! నిట్టూర్చాడు నాగభూషణం.

ఇంటికి వెళ్లింతర్వాత కూడా సుధను గురించే ఆలోచించాడు.

'సుధ తనతో మాట్లాడకుండా వుంటుందా? తన మంచితనం తెలియదూ? తను ఆడవాళ్ల వెంటపడడు. ఈలలు వేయడు. అల్లరి చేయడు. చొరవ తీసుకొని మాట్లాడడు. ఇవన్నీ సుధకి తెల్సు. 'కాని కాలం కలిసిరావాలి' నిట్టూర్చి నిద్రపోయాడు నాగభూషణం.

మరునాడు నాగభూషణం బస్టాప్‌కి బయలుదేరాడు. అక్కడ ఉన్న సుధని చూశాడు. అక్కడే వున్న ఓ కొట్టులో ఏదో కొని మళ్లీ తిరిగి వచ్చేశాడు.

'సుధకి తను రోజూ కనిపిస్తుండాలి. లేకపోతే తన మంచితనం ఎలా తెలుస్తుంది మరి? కనీసం పావుగంటేనా ఆమె ప్రక్కన ఉండాలి. ఎప్పుడో ఒకప్పుడు పలకరించక పోదు. కానీ రోజూ బస్టాప్‌కి వెళ్లి ఆమెతో పాటు నుంచొని మళ్లీ బస్సెక్కకుండా తను తిరిగివచ్చేస్తే సుధ మరోలా భావించదూ? ఆమె కోసమే తను వస్తున్నట్టు ఆమె వెంట పడుతున్నట్టూ తెల్సుకొని ఛీ- రోడ్ వెధవలా తయారయ్యాడు' అని అనుకోదూ? ఆ దెబ్బతో తన రెండేళ్ల ప్రేమ రెండు ప్రక్కలై పోతుంది. అలాకాదు. తను కూడా ఆమె ఆఫీసున్న పరిసరాల్లోనే తనూ ఒక ఉద్యోగం చేస్తుండాలి. అప్పుడు తను వెంట బడినట్టు అవదు. తనూ ఆఫీసు కెళుతున్నాడు అంతే!'

పై ఆలోచన ప్రకారం సుధ ఆఫీసు పరిసరాల్లో ఉద్యోగం సంపాదించడానికి నిర్ణయించుకున్నాడు నాగభూషణం.

మర్నాడు సుధ వచ్చే వేళకు బస్టాప్‌లో నుంచున్నాడు. సుధ మెల్లగా నడచి వస్తుంటే నాగభూషణం మెల్లగా చూసాడు. తర్వాత తన చుట్టూ జనాని కేసి చూస్తు కున్నాడు తను సుధని చూస్తుండడం



కాలివేళ్ల మధ్య ఒరుపుడు పుళ్ళు మడమ పగుళ్ళు

చర్మంలో సహజంగా వుండే చమురులు లోపించటంవల్ల కలుగుచున్నవి

కాలివేళ్ళ మధ్య ఒరుపుడు పుళ్ళు, మడమ పగుళ్ళు లిచెన్‌సా వల్ల నయం కాగలవు: ఏమంటే, లిచెన్‌సా చర్మానికి పోషణ ఇస్తుంది. త్వరితగతిని దీర్ఘకాలం నిలిచియుండేట్లు గుణమిస్తుంది.

చర్మ రుగ్మతలు **లిచెన్‌సా**కు శీఘ్రంగా లొంగుతవి
నేడే ఒక ట్యూబువాడి చూడండి

DZ 1613 TG

ఎవరైనా గమనిస్తున్నారేమోనని. కాని అంతా సుధ వంకే చూస్తున్నారు. సుధ తలొంచుకొని నుంచొనుంది.

బస్సు వచ్చి ఆగింది. కొంత అలజడి జరిగింతర్వాత సుధ నాగభూషణం బస్సు ఎక్కారు. ఇంకా ఎక్కవలసిన వాళ్ళు చాలా మంది ఉండగానే బస్సు కదిలింది.

'తను అదృష్టవంతుడు' అనుకున్నాడు నాగభూషణం తనకంటే రెండు గజాల దూరంగా ఉన్న సుధని ఒకసారి చూసి.

''ముందుకి జరగండి సార్! ముందుకి జరగండి' అంటూ అరిచాడు కండక్టర్. అంతా కండక్టర్ చెప్పిన విధంగా సర్దుకునే సరికి నాగభూషణం సుధ ముందు నుంచో వాల్సిన అవసరం ఏర్పడింది. అది నాగభూషణానికి చాలా ఇబ్బంది కలిగించింది. సుధని చూడడానికి ధైర్యంలేక పక్కకి తిరిగి నిలబడ్డాడు.

బస్సు ఆగింది. నాగభూషణం గబగబా దిగాడు. అతని వెంటే సుధ కూడా దిగింది.

నాగభూషణం తత్తరపడ్డాడు. కాళ్ళు ఎటు పోవాలో తెలియక తడబడ్డాయి. గబగబా ప్రక్కనే ఉన్న కాఫీ హోటల్లోకి పరుగెట్టాడు. పరుగెత్తినంత పనిచేశాడు.

సుధ మామూలుగా తలొంచుకొని వెళ్ళిపోయింది ఇదేమీ పట్టించుకోకుండా.

కాసేపటికి తేరుకొని కాఫీ హోటల్లోంచి బయటపడ్డాడు. ఆ ఏరియాలో ఉన్న ప్రతి ఆఫీసులోను ఉద్యోగం కోసం అడిగాడు నాగభూషణం. అంతా నోరు చప్పరించారు. కాని, సుధ ఆఫీసు కనిపెట్టగలిగాడు.

ఆరోజు రాత్రి నిద్రపోయే ముందు మళ్ళీ ఆలోచించాడు.

'తనకి అక్కడ ఉద్యోగం దొరకలేదు ఇక తర్వాత కర్తవ్యం ఏమిటి? కాలేజీలో చదివే రోజుల్లోకన్నా ఈ వారంరోజుల్నుంచి సుధ మీద తనకి బాగా పిచ్చి పట్టుకుంది. ఆమె పలకరిస్తేకాని తన బాధ తీరేలా లేదు.. అయితే ఇకనుంచి, సుధతో బసు ప్రయాణం బందేనా? ఇక వేరే మార్గమే లేదా?' ..ఉద్యోగం చేస్తున్నట్టు నటించి రోజూ సుధతో పాటు బస్సెక్కి వెళ్ళొచ్చుగా? అవును. ఈ ఆలోచన బాగుంది నిశ్చింతగా నిద్రపోయాడు నాగభూషణం.

రోజూ సుధతో పాటే బస్సెక్కి వెళ్ళి సుధ దిగినచోటే దిగడం నేర్చుకున్నాడు నాగభూషణం. అతనికి కొద్దిగా ధైర్యం చిక్కింది. అలా చాలారోజులు చేశాడు. కాని ఫలితం శూన్యం. ఆమె పలకరించలేదు.

నాగభూషణానికి నిరాశ ఎక్కువయింది. విసుగు పుట్టింది. 'ఎంతకాలం ఇలా జాగు చెయ్యాలి. తనకి ఆమెని పలకరించేంతటి సాహసంలేదు. ఒకవేళ సాహసంచేసినా తనని అపార్థంచేసుకుంటే తనగతి ఏంకాను? ఇంత కాలం తనుచేస్తున్న ప్రయత్నం ఒక్క సెకనులో ఎగిరిపోవడం తన కిష్టంలేదు.

'ఇలా భయపడుతూనే రెండేళ్ళు గడిపే శాడు తను. ఈ రెండేళ్ళకి ఒక్కమాట కూడాలేదు సుధతో. ఇలాగే ఆమె పలకరిస్తుందని కాసుకొని, కూర్చుంటే... ఆమెకి ఇంకొకళ్ళతో పెళ్ళి అయిపోతుంది. అప్పుడు తను ఏడవాలి.. కాబట్టి ఇప్పుడు తను ఏదో ఒక ఎడ్వెంచర్ చేయాలి. రేపో ఎల్లుండో ఆమెని పలకరించేయాలి.. ఏమని?.. 'మీ ఆఫీసులో ఏమన్నా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయా' అని అడగొచ్చు. ఇందులో ఏంతప్పు లేదు కదా?' అనుకున్నాడు.

మరునాడు పలకరిద్దామని సుధకి దగ్గరిగా వెళ్ళాడు. జనం అంతా తననే చూస్తున్నట్టు గమనించి కలవరపడ్డాడు. నోటి వెంటనుంచి మాట పెగల్లేదు.

బస్సు వచ్చింది. అందరూ బస్సు ఎక్కారు. కాని నాగభూషణం ఓడిపోయిన వాడిలా నుంచున్నాడు. బస్సు ఎక్కకుండా. అతని కళ్ళ వెంబడి నీళ్ళు రాబోతుండగా ఏదో, నలకపడ్డట్టుగా నటించి చేతి రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు.

నాగభూషణానికి ఆవేశం పెరిగిపోయింది. బాగా ఆలోచించి చివరికి సుధకి ఒక ఉత్తరం రాయడానికి నిశ్చయించుకున్నాడు. ఎక్కువ మాటలు రాయదల్చుకోలేదు. తెల్లకాగితం తీసాడు.

'సుధగార్కి,

నేను మిమ్మల్ని ప్రేమించాను. మీ ప్రేమ నాకు కావాలి. ఇవ్వగలరా?

నాగభూషణం.

కాయితాన్ని నాలుగు మడతలు పెట్టేసి మర్నాడు ఉదయమే సుధ ఆఫీసు అడ్రసుకి పోస్టు చేశాడు. ఇంటికొచ్చి మళ్ళీ ఆలోచించాడు.

'అయ్యో! ఆవేశంలో తను ఎంతపని చేశాడు? ఓ పరాయి ఆడపిల్లకి ప్రేమలేఖ రాయడమా? ఎంత తప్పు?? తను ఎంత బలహీనుడైపోయ్యాడు. చిన్న పొరపాటు వల్ల తను సుధ మనసులో తను చెడ్డ వాడుగా భావింపబడతాడు. ఇక సుధ మొహం తను ఎలా చూడగలడు? తనని చూసి ఎంత అసహ్యించుకొంటుంది? ఆమెని రోజూ చూసే భాగ్యం తను పోగొట్టుకున్నాడు. ఇక విచారించి లాభంలేదు. సుధని మరిచి పోవాలి.'

నాగభూషణం పశ్చాత్తాపపడ్డాడు. మరో రెండు రోజులకే అతను మరో ఊళ్ళోకి వెళ్ళాడు ఉద్యోగ రీత్యా. 'ఉద్యోగం తెప్పించి తను ఈ వూరు వదిలి వెళ్ళడానికి భగవంతుడు తనకు సహాయం చేశాడు' అని దేవుడ్ని తలుచుకున్నాడు.

* * *

బస్సు బెజవాడలో ఆగేసరికి ఆలోచన ల్లోంచి తేరుకున్నాడు నాగభూషణం. అందరూ దిగారు. నాగభూషణం, సుధా పిల్లలూ మిగిలారు.

సుధ సామాన్లు పట్టుకొని లేచి నిలబడింది. నాగభూషణం తలొంచుకొని గబగబా దిగిపోయాడు. అతనితో పాటే సుధా పిల్లలూ దిగారు.

''నాగభూషణంగారూ!'' అన్న పిలుపు గబగబా నడుచుకుంటూ వెళుతున్న నాగభూషణాన్ని కట్టేసింది. సుధ అతని దగ్గరి కొచ్చింది.

''మరిచిపోయారా?'' నవ్వింది.

నాగభూషణం తలవంచుకున్నాడు.

''ఇప్పుడు ఎక్కడ వుంటున్నారు?'' అడిగింది చంటాడ్ని సరిగా ఎత్తుకుంటూ.

చెప్పాడు నాగభూషణం.

''మా ఇల్లు ఇక్కడే. ఓసారి చూసి వెళుదురుగాని రండి'' అంటూ బయలు దేరింది.

నాగభూషణం యాంత్రికంగా కది లాడు.

'పదేళ్ళ క్రితం బస్స్టాప్‌లో తను చూసిన సుధేనా?'' అనుమానం వేసింది.

''ఉత్తరం రాయడం తెలుసుగాని, ఫ్రం ఎడ్రస్ రాయడం తెలీదా?'' నవ్వింది సుధ.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు నాగభూష ణం. ఏదో కలలా భ్రమించాడు ఆమె పలుకుల్ని.

సుధ అతన్ని ఇంటికి తీసుకువెళ్ళి భర్తకి పరిచయం చేసింది. ఇద్దరి పిల్లలతో, దైవంలాంటి భర్తతో సంసారంలో స్వర్గం అనుభవిస్తున్న సుధని చూసి తృప్తిపడ్డాడు.

'పోనిలే! సుధ తనని ప్రేమించింది. అంతే చాలు' నిట్టూర్చాడు నాగభూషణం.